మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి

**కొండపాక, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** చిన్న పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం ఉమ్మడి కొండపాక మండలంలోని మర్పడ్గ, కుకునూరుపల్లి, మేదినిపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పిల్లలకు ఆటపాటలతో విద్యనందించాలన్నారు. ప్రీస్కూల్ విద్య ముఖ్యమైనదని చెప్పారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణీలకు, చిన్నరులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మేదినిపూర్‌లోని సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. అంగన్‌వాడి విద్యార్థులు అడిపాడిన విధానం చూసి సంతోషం వ్యక్తం చేశారు. అయన వెంట జిల్లా ఇంచార్జి సంక్షేమధికారి ఎల్లయ్య, తహసీల్దార్‌లు దిలిప్‌నాయక్, మల్లికార్జున్‌రెడ్డి, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, సిడిపిఒ రమాదేవి, పిఆర్ఎఈ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టిచర్లు పాల్గొన్నారు.

## నేడు నవోదయలో ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీ

**వర్గల్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయలో గురువారం ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీ జరుగుతుందని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎంపి రఘునందన్‌రావు హాజరుకానుండగా విశిష్ట అతిథిగా నవోదయ విద్యాలయ సమితి హైద్రాబాద్ ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకులు ఈ.ఉమాపతిరెడ్డి రానున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథి ఈ కార్యక్రమాన్ని తిలకించి న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తారని అన్నారు. మన దేశ రాజధాని న్యూఢిల్లీలోని లోక్‌సభలో జరిగే కార్యకలాపాలన్నింటినీ ప్రతిబింబించే విధంగా ఈ యూత్ పార్లమెంట్ పోటీ ఉంటుందని, ఈ పోటీలో సుమారు 55 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్త సభ్యుల ప్రమాణస్వీకారం, కొత్తగా నియమింపబడ్డ మంత్రుల పరిచయము, ప్రశ్నోత్తరాల కార్యక్రము, సంతాప తీర్మానము మరియు ముఖ్యమైన బిల్లులపై చర్చలు ఉంటాయని తెలిపారు. వాడి వేడి చర్చలకు ఈ ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ వేదిక కానున్నదని ప్రిన్సిపాల్ రాజేందర్ పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

## ఆర్ అండ్ ఆర్ కాలనీ వివరాలు అందించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఆర్ అండ్ ఆర్ కాలనీల పూర్తి వివరాలను అందించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో సిద్దిపేట, గజ్వేల్ డివిజన్‌లలోగల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో సౌకర్యాలు, ఆయా కాలనీలలో ఉంటున్న వారి వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో నిర్మించిన ఇండ్లు కేటాయించిన లబ్దిదారులు ప్రస్తుతం ఆయా ఇండ్లలో ఉంటున్న వారి వివరాలు కేటాయించని ప్లాట్స్ తదితర పూర్తి వివరాలతో మ్యాపింగ్ చేసి ఈనెల చివరికల్లా అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అన్ని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో చేపట్టిన తాగు నీరు, విద్యుత్, డ్రైనేజీ, హెల్త్ సెంటర్, పాఠశాలలు, వైకుంఠ దామాలు పూర్తిస్థాయిలో పని చేసేలా చూడాలని అందుకు అవసర మయ్యే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓలు బన్సీలాల్, సదానందం, వివిధశాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

## బూత్ లెవల్ ఏజంట్లను ఏర్పాటు చేసుకోవాలి

### -రాజకీయ ప్రతినిధులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయిన కలెక్టర్ క్రాంతి

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ లెవల్ ఏజంట్లను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి బిఎల్ఓ యాప్ ద్వార కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ చేసుకోవడం జరుగుతుందన్నారు. సర్వేకు ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను విభజించడం, కొత్త వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అక్టోబరు 29న ఓటరు జాబితా డ్రాఫ్ట్ రోల్ ప్రకటించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలన్నీ పోలింగ్ బూత్‌ల వారిగా ఏజంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అక్టోబరు 29 నుంచి నవంబర్ 28లోపు రెండు పర్యాయాలు పోలింగ్ బూత్‌స్థాయిలో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రాఫ్ట్‌రోల్‌లో అభ్యంతరాలు ఉంటే స్పెషల్ క్యాంపెయిన్‌లో ధరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించడం జరుగుతుందన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల నాయకులు తమ వంతు కృషి సల్పాలన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఆంథోనీ, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డాక్టర్ అబ్దుల్ కలామ్ జాతీయ అవార్డుకు బట్టు వెంకట్‌రాజ్ ఎంపిక

**కొల్చారం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** డాక్టర్ అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారం 2024 అవార్డుకు కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన ప్రధానోపాధ్యాయులు బట్టు వెంకట్‌రాజ్ ఎంపికయ్యారు. యువ తేజమ్ ట్రస్టు, కలామ్ విజన్ నేషనల్ టీమ్ సౌజన్యంతో ఈ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహిస్తున్నట్లు వెంకట్‌రాజ్ తెలిపారు. ఈ నెల 14న తిరుపతి పట్టణంలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో వెంకట్ రాజ్ డాక్టర్ అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారం అవార్డు అందుకోనున్నారు. ప్రస్తుతం వెంకట్‌రాజ్ ప్రధానోపాధ్యాయులుగా మలుతుమ్మెద పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. వెంకట్‌రాజ్ జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం పట్ల సంగాయిపేట గ్రామస్థులు, ఆయన స్నేహితులు వెంకట్‌రాజ్‌కు శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతున్నారు.

## ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్

**పాపన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే సృజనాత్మకత లభిస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం పాపన్నపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉత్తమ విద్యాబోధనకు ప్రభుత్వ పాఠశాలలు తార్కాణాలుగా నిలవాలన్నారు. విద్యాలయ పరిశుభ్రకై తీసుకుంటున్న చర్యల గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తిచేసి ప్రతి విద్యార్థిని ఉత్తమ ఫలితాలు అందుకునేలా చూడాలని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. డాక్టర్లు ప్రతి పేషంట్ యొక్క కే షీట్‌ను తప్పని సరిగా నిర్వహించాలన్నారు. అధికారులు ప్రతి గ్రామాలలో పర్యటించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## మెడికల్ కళాశాల అనుమతితో

# నెరవేరిన మెదక్ జిల్లా ప్రజల చిరకాల కోరిక

**అభివృద్ధిలో మెదక్ జిల్లాను ముందుంచుతా**
**కళాశాల అనుమతికి సహకరించిన**
**అందరికీ ధన్యవాదాలు**
**మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్11 ప్రభాతవార్త:**
మెదక్ జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన మెడికల్ కళాశాలకు ఢిల్లీ నుంచి అనుమతి లభించడంతో మెదక్ జిల్లా ప్రజల కోరిక నెరవేరిందని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని పిల్లికొట్టాల్‌లోని మెడికల్ కళాశాల భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ మెదక్ జిల్లా అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతానని తెలిపారు. అదేవిధంగా మెడికల్ కళాశాలకు అనుమతి కొరకు కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పక్కా భవనానికి కృషి చేస్తానని, మెదక్ జిల్లాకు మెడికల్ కళాశాలకు అనుమతి లభించడంతో మెడికిల్ కళాశాలకు పక్కా భవన నిర్మాణం కొరకు స్థలాన్ని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌లు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ పక్కా భవనం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు దాయర లింగం, దొంతి లక్ష్మీ ముత్యంగౌడ్, షమీ, లక్ష్మీనారాయణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్‌రావ్, బొజ్జ పవన్, మాజీ మార్కెట్ కమిటీచైర్మన్ గంగానరేందర్, పాపన్నపేట మండల నాయకులు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, భరత్, మార్గం నాగరాజు, శంకర్, శ్రీనివాస్ చౌదరి, లష్కరు శ్రీనివాస్, పరశురాం, సాధిక్, బాని, మహేష్‌గౌడ్, హఫీజ్ మొల్సాబ్, మందుగుల గంగాధర్, పవన్ శ్రీకార్, లల్లూ, రాజాసింగ్, శ్రీకాంత్ రెడ్డి, అరుణ, ఏరియా సుపత్రి సూపరింటిండెంట్ శివదయాల్, ఎంఆర్‌వో లక్ష్మణ్ పాల్గొన్నారు.


మెడికల్ కళాశాలకు భవనానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కలెక్టర్ రాహుల్‌రాజ్

**ఎమ్మెల్యే కృషి అభినందనీయం**

మెదక్ జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాలకు అనుమతికి కృషి చేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌కు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాందాస్ చౌరస్తాలో ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకొని అభినందనలు తెలిపారు. బాణాసంచాలు కాల్చుతూ హర్షం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి

## 'మహిళ శక్తి'లో వంద శాతం ప్రగతిని సాధించాలి

### అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి సరస్వతి

**నర్సాపూర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**
ప్రతి గ్రామంలో మహిళ శక్తి కార్యక్రమాల్లో వంద శాతం ప్రగతిని సాధించాలని అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకుల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షా సమావేశానికి సరస్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఒక ప్రణాళిక బద్దంగా పనిని చేస్తు సమయానుసారంగా అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు. ప్రతిగ్రామంలో మహిళ శక్తి కార్యక్రమాల్లో వంద శాతం ప్రగతిని సాధించాలని పేర్కొన్నారు. అదేవిదంగా బ్యాంక్ లింకేజీ శ్రీనిధి, ఫామ్, నాన్ పామ్, సంస్థా గత నిర్మాణం, ఆంశాలలో జిల్లాలోనే నర్సాపూర్ ముందంజలో నిలపాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏపిఎం మార్గం గౌరిశంకర్, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సునిల్‌గాంధీ, ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్, సిసిలు దేవిసింగ్, రవిందర్, ఆంజనేయులు, బాగ్య, ప్రవీణ, అకౌంటెంట్ మల్లేష్యం, ఆపరేటర్ సురేశ్ పాల్గొన్నారు.

## బదిలీ అయిన ప్రిన్సిపాల్ రవీందర్‌కు సన్మానం

**నర్సాపూర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా 8 సంవత్సరాలు విధులు నిర్వహించి బదిలీ అయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవిందర్‌కు కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికి శాలువాలతో పూల మాలలతో ఘనంగా సన్మానించారు. నర్సాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 8 సంవత్సరాలుగా పని చేసిన ప్రిన్సిపాల్ రవిందర్ బిహెచ్ఈఎల్ కు బదిలీ పై వెళ్ళారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్‌జూనాయర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా నూతనంగా బదిలీ పైవచ్చిన శేషచారి. బదిలీ పై వచ్చిన నూతన లెక్చరర్‌లు నర్సాపూర్‌నుండి బదిలీ పై వెళ్లిన లెక్చరర్‌లు శ్రీహరి, జానకీ లను సైతం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన రవిందర్ కళాశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశాడని అన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో లెక్చరర్‌లు జ్యోత్స్న, ప్రణీత్, నాగరాజు, పాండునాయక్, తాజొద్దీన్, విజయలక్ష్మి, రాజేశ్వర్, అమీనా, నాజియా, రమాదేవి కళింగరెడ్డి, బోదనేతర సిబ్బంది, బాసిత్, హాపీజ్‌ఖాన్ బదిలీ పై వెళ్లారు వారిని సైతం సన్మానించారు.


ఉపాధ్యాయులను సన్మానించిన మండల విద్యాధికారి

## ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనది

### ఎంఇవో బుచ్చయ్యనాయక్

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 11,ప్రభాతవార్త:** ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైనందని మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను భోదించి వారిని అత్యుత్తమ స్థాయిలో ఉండటానికి ఉపాధ్యాయులు చేసే సేవ వెలకట్టలేనిదన్నారు. విద్యార్థులకు, విద్యా బుద్దులను నేర్పించి వారిని ఒక మార్గంలో పెట్టేవాడు గురువని, నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్ని చెడు అలవాట్లు బారిన పడనీయకుండా ఉత్తమ మార్గాలవైపు పయనించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు వేణుగోపాల్, రాజేశ్వర్, నరేష్, తెరిసా, బోక్‌కస్, బాలరాజు, శ్రీజ, టి వేణుగోపాల్, రమేష్, దివ్య, శ్రీలత, లక్ష్మణ్, స్వామి, శారద, సీఆర్పి సందీప్, కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, నోడల్ ఆఫీసర్ పుష్పరాణి, ప్రధానోపాధ్యాయులు దీప్లా, గీతా, శ్రీదేవి, సాయిరెడ్డి, శివప్రసాద్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పోచయ్య, సత్యనారాయణ, గోపి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిత్యపూజల అందుకుంటున్న గణనాథుడు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :**
గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద నవరాత్రోత్సవలలో భాగంగా గణనాథుడు నిత్యపూజలు అందుకుంటున్నారు. భక్తులు పెద్ద యెత్తున తరలివచ్చి గణనాథునికి ప్రత్యేక పూజల నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 12 వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగేంద్రరావు, ఆకుల చందు, నాగరాజు, బిక్షపతి, బండి ప్రేమ్‌కుమార్, బండి స్వామి, సంతోష్, ఎడెల్లి స్వామి, పవన్, తిరుపతి, సంతోష్ మామిడాల అంజనేయులు, మల్లేశం, మహేష్, నారాయణ, నిఖిల్, భాను, సందీప్, సాయితేజ, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు,కుంటలు ఆక్రమణకు గురికావద్దు

### -హెచ్ఎండిఎ వెబ్‌సైట్‌లో చెరువుల మ్యాపింగ్ ఉంచాలి.. అధికారులకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచన

**సంగాంరెడ్డి టౌన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**
జిల్లాలో చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా అధికారులు తగు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో రెవిన్యూ, సర్వేల్యాండ్ రికార్డ్, నీటిపారుదల శృాఖల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని హెచ్ఎండిఏ పరిధిలోని 8 మండలాలకు చెందిన 666 చెరువులు, కుంటలకు సంబంధించిన ఫైనల్ నోటిఫికేషన్ మ్యాప్‌లను పంపాలన్నారు. వైబ్‌సైట్‌లో 666 చెరువుల మ్యాపులు సిద్ధంచేసేముందు తప్పులు లేకుండా సరిచూసుకోవాలన్నారు. గ్రామాల్లోని చిన్న, పెద్ద చెరువుల ఎఫ్‌టిఎల్ పరిధి, బఫర్ జోన్‌ల హద్దులు గుర్తించి వాటిలో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారరు. చెరువుల, కుంటల ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ముందు రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు ఐనేష్ డిఈ యేసయ్య, ఈఈ భీమ్, హెచ్ఎండిఏ పరిధిలోని 8 మండలాల తహసీల్దార్‌లు, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిగా మెదక్-మెటల్‌కుంట రోడ్డు

### -జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగ జోగినాథ్

**పాపన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మెదక్-మెటల్‌కుంట రోడ్డును జాతయ రహదారిగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రోడ్డు వివరాలు సేకరించిందని జోగిపేట మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ గంగ జోగినాథ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జోగినాథ్ మాట్లాడుతూ మెదక్ నుంచి బొడ్మట్‌పల్లి వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని కోరుతూ మెదక్ ఎంపి రఘునందన్‌రావు, కేంద్ర ఉపరితల రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరిల కార్యాలయాలకువెళ్లి అందించిన వినతిపత్రానికి స్పందన వచ్చిందన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్ వచ్చిందన్నారు. జాతీయ రహదారిగా మార్చేందుకు కేంద్ర ఉపరితల రవాణ శాఖ రీజినల్ అధికారి క్రిష్ణ ప్రసాద్, రాష్ట్ర నేషనల్ హైవే ఎస్సీకి ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. రోడ్డు నిర్మాణంతో ఏడుపాలయ వనదుర్గా భవాని మాత ఆలయం, మెదక్ చర్చి, ఝరాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయం, న్యాల్‌కల్ మండలంలోని స్వయంభూ శ్రీ సిద్ధివినాయక ఆలయం, జహీరాబాద్ హైటెక్ సిటీతో పాటు కర్ణాటక రాష్ట్రానికి అనుసందానం ఏర్పడుతుందన్నారు. జాతీయ రహదారిగా రోడ్డును మార్చేందుకు కృషి చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సంజయ్, రాష్ట్ర మంత్రి సి దామోదర్ రాజనర్సింహా, మెదక్, జహీరాబాద్ ఎంపిలు రఘునందన్‌రావు, సురేష్‌కుమార్ శెట్కార్, మాజీ ఎంపి బిబి పాటిల్లకు జోగినాథ్ ధన్యవాదాలు తెలిపారు.

## అచ్చంపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో గతంలో 162 సర్వే నెంబర్‌లో విద్యుత్ ఉప కేంద్రం కోసం భూమిని కేటాయించగా అందులో గ్రామస్థులు అక్రమంగా గుడిసెలు, షెడ్లు నిర్మించారు. దీంతో బుధవారం రెవెన్యూ అధికారులు జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## నల్ల చెరువుకు బుంగ

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** మండల పరిధి చెన్నాయిపల్లిలోని నల్ల చెరువుకు బుధవారం మధ్యాహ్న సమయంలో బుంగ పడటంతో నీరు వృదాగా పోతుంది. ఈ విషయం గమనించిన గ్రామస్తులు, యువకులు చెరువు వద్దకు చెరుకొని ఇసుక బస్తాలను అడ్డుగా పెట్టి నీటి వృధాను కొంత మెరకు అడ్డుకట్ట వేశారు. అధికారులు స్పందించి బుంగను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బుంగ పడిన చెరువుకు బస్తాలను అడ్డుపెడుతున్న గ్రామస్తులు

## మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందికి జరిమానా

**గజ్వేల్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి సిబ్బందితో కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్‌రోడ్డు, తూప్రాన్ రోడ్డు, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, ఔటర్ రింగ్‌రోడ్డు పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 15 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రావడంతో వారికి గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక రూ.30 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

## గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు

### మరో నలుగురు పరారు

### 50 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు, మోటారు సైకిళ్ల స్వాధీనం

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 11,ప్రభాతవార్త :** గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొన్నాల టిహెచ్ఆర్ కాలనీకి చెందిన నాచారం సాయికుమార్(22), పొన్నాలకు చెందిన కోటగల్ల ఆదర్శ్(20), దుద్దెడ మండలం కొంపాకకు చెందిన తలారి రాకేష్(23), దుద్దెడ గ్రామానికి చెందిన దయ్యాల శ్రీకాంత్(23)లు మోటార్ సైకిళ్లపై గంజాయి సరఫరా చేయడానికి సిద్దిపేటకు వస్తుండగా నమ్మ దగిన సమాచారం మేరకు ఎస్ఐ చంద్రయ్య సిబ్బందిలో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద 50 గ్రాముల నిషేధిత గంజాయి, సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నలుగురు నిందితులు చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన దండు రాజేష్, నంగునూర్ మండలం రాంపూర్‌కు చెందిన గంగుల గణేష్, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రణయ్, కోహెడ మండలం జ్యోతిరావుతండాకు చెందిన బూక్యా అనిల్ పరారిలో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే పరారిలో ఉన్న నలుగురు నిందితులను పట్టుకుంటామని త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు.


మాట్లాడుతున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

## పార్కులో పెండింగ్ పనులు పూర్తి చేయాలి
### - అధికారులను ఆదేశించిన కాలేరు


పార్కును సందర్శించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** నల్లకుంట డివిజన్‌లోని నరే ంద్ర పార్కును బుధవారం అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానికులు, పార్కు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### తెలుగు భాషను నేర్చుకోవడంతో ఖాతాదారులకు మెరుగైన సేవలు


తెలుగు భాష శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బ్యాంక్ అధికారులు

**సైఫాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** తెలుగు భాషను నేర్చుకోవడం ద్వారా ఖాతాదారులతో బ్యాంకు వ్యవహారాలు సులభతరం అవుతాయని పలువురు వక్తలు చెప్పారు. తద్వారా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని వక్తలు అన్నారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, ఉద్యోగుల తెలుగు భాషా శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. నగరంలో పనిచేస్తున్న హిందీ రాష్ట్రాలకు చెందిన అధికారులకు, ఉద్యోగులకు తెలుగు భాషలో ప్రవీణ్యత కోసం ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ భగవంత్‌రావ్ కావ్డే, ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి, కన్వీనర్ శృతికాంత్ భారతి, అధ్యాపకుడు నాగేశ్వర్‌రావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ చంద్రమోహన్ మినోచా, జనరల్ మేనేజర్ గిరీష్ చంద్రజోషి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వివేకానంద, జోనల్ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కర్‌రావు, జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన నేతికార్ సురేష్ లాల్


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సురేష్ లాల్

**తార్నాక, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** ఇటీవల నూతనంగా టీపీసీసీ చీఫ్ గా మహేష్‌కుమార్ గౌడ్ నియమితులైన సందర్భంగా బుధవారం సికింద్రాబాద్ నియోజక వర్గం లాలాపేట్‌కు నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ ఏబ్లాక్ అధ్యక్షుడు, టీపీసీసీ కార్యదర్శి నేతికార్ సురేష్ లాల్ బృందం మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకుడు మహేష్ కుమార్ గౌడ్‌కు నూతన అధ్యక్షులుగా నియమించడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని సురేష్ లాల్‌పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీబ్లాక్ అధ్యక్షులు జగ్గు, జహంగీర్, కరీం, యాది, శైలు రెడ్డి, యాదగిరి, విక్కితో పాటు పలువురు అధ్యక్షుడిని కలిసిన వారిలో ఉన్నారు.

## ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీ అనేది ప్రజలకు చెప్పాలి
### -మాజీ కార్పొరేటర్ రంగారావు

**వివేకానందనగర్ కాలనీ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఏ పార్టీకి చెందినవారో ప్రజలకు చెప్పాలని వివేకానంద నగర్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అభివృద్ధి పేరుతో పార్టీలను మారుస్తూ నాయకులను, కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నారని, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల అండదండలతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పార్టీలు మారుస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన కొద్దికాలంలోనే ఆ పార్టీకి గుడ్‌బాయ్ చెప్పి బిఆర్ఎస్‌లో చేరి రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా పనిచేసి కోట్లాది రూపాయలు నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం మర్చిపోయారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన అరికెపూడి గాంధీ తాను పార్టీ కండువని కప్పుకోలేదని అనడం హాస్యాస్పదమని అన్నారు. రేవంత్‌రెడ్డి ద్వారా తాను దేవాలయం కండువా కప్పుకోవడం జరిగిందని అరికెపూడి గాంధీ అనడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు ఏమైనా దేవాలయమా కండువా కప్పుకోవడానికి ఆయన పూజారా అంటూ వ్యంగంగా మాట్లాడారు. తాను ఏ పార్టీలో లేనని ప్రతిపక్ష హోదాలోనే ఉన్నానని చెబుతూనే కాంగ్రెస్ పార్టీలో ఉన్నత పదవులు పొందుతూ ఆ పార్టీలో లేనని కండువా కప్పుకోలేదని పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటని రంగారావు ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు హైకోర్టులో వేసిన పిల్‌కు భయపడి ప్రతిపక్షంలోనే ఉన్నాను అనడం ఎంతవరకు సమంజసం అన్నారు.

## భగవంతుడిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయి : ఎమ్మెల్యే శ్రీగణేష్


గణేష్ మండపాల్లో పూజలు చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** విఘ్నేశ్వరుడిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కంటోన్మెంట్ 5వ వార్డు, 7వ వార్డు తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన గణేష్ మండపాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డుకు చెందిన సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంకి రవిందర్ బాబు,శ్రీనివాస్, మధు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గణేష్ ఉత్సవాలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అరికెపూడి గాంధీ


శ్రీ విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించిన హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మాజీ బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్, భక్తులు


బోయిన్‌పల్లి గణేష్ మండపంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి


రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు


శ్రీ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న కమిటి సభ్యులు


శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పూజలు నిర్వహిస్తున్న అధ్యక్షులు దేవరింటి మస్తాన్‌రెడ్డి.


పూజలునిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్


రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్‌యాదవ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్ బాబు

**వివేకానందనగర్ కాలనీలో...**

**వివేకానందనగర్ కాలనీ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** వివేకానందనగర్ కాలనీ డివిజన్ రామకృష్ణ వీధిలో రామకృష్ణ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రజా పద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పాల్గొని, గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ విగ్నేశ్వరుడు నియోజకవర్గ ప్రజలందరికీ సుఖ సంతోషాలు, శాంతి సౌభాగ్యాలు ప్రసాదించాలని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో గణనాధుని పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి సురేందర్ రెడ్డి, చంద్రకాంతారావు, రామచంద్రరావు, తాండవ కృష్ణ, వంశీ వజ్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రావు, వెంకటేశ్వరరావు, శ్రీధర్, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, చంగల్‌రెడ్డి, నాగేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, నాగేశ్వరరావు, సునీత, సుభాషిని, మంజుల, అన్నపూర్ణ, కరుణా, లక్ష్మీ, వాణి తదితరులు పాల్గొన్నారు.

**పాతబస్తీ గల్బవీధిలో ...**

**చార్మినార్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాలు జరుపుకుంటున్నారని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మాజీ బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీ కాంత్ అన్నారు.పాతబస్తీ గల్బవీధిలో స్థానిక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇరవై ఎనిమిది అడుగుల శ్రీ విఘ్నేశ్వర విగ్రహానికి ఆయనతో పాటు పలువురు భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం బిజెపి మాజీ కన్వీనర్లు ఉమా మహేంద్ర,సురేందర్‌తో పాటు పలువురు బిఆర్ఎస్,బిజెపి నాయకులు,గణేష్ మండపం నిర్వాహకులు పాల్గొన్నారు.

**బోయిన్‌పల్లిలో..**

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని బోయిన్‌పల్లిలో రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, ఆనంద్ బాబు, బి.భాస్కర్,శ్రీరామ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**శ్యామలకుంట బస్తీల్లో...**

**సంజీవరెడ్డి నగర్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** ఎస్ఆర్‌టి, ఈడబ్ల్యూఎస్, రేణుక నగర్, 60ఫీట్ రోడ్, శ్యామలకుంట బస్తీల్లోని వినాయక మండపాల్లోని విఘ్నేశ్వరులను మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ముత్యాల హనుమంతరావు, కూతురు నరసింహ, పుట్టాల శేఖర్, కట్ట బలరాం, మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ నగర్‌లో...**

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మోండా డివిజన్ రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో బిజెపి నేత చిన్న వీరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి వేడుకలు, అన్నదాన కార్యక్రమానికి మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక,కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంశా తిలక్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

**వివేకానందనగర్ కమ్యూనిటి హాల్‌లో...**

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** వాడవాడల గణనాధునికి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీ వివేకానందనగర్ కమ్యూనిటి హాల్‌లో శ్రీ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకునికి సేవా సమతి చైర్మన్ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, ఆధ్యక్షులు గంగుమళ్ళ వరప్రసాద్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండపం వద్ద ఏర్పాట్లు చేశారు. పూజ అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాయితీ యాదవరెడ్డి, చిలకల కృష్ణారెడ్డి, కలవల ఏడుకొండలు, రవిందర్‌రెడ్డి, కేశవరావు, బొంతు హరికృష్ణ, కమ్మరి శ్రీను, ఎస్.ఎస్ శ్రీను, గణేషుల నాగేశ్వరరావు, గంగుమళ్ళ రాజు, దండం శివరామ్, తదితరులు పాల్గొన్నారు.

**విటీమ్ ఆధ్వర్యంలో**

శ్రీ వివేకానంద నగర్‌లోని విటీమ్ ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ది వినాయక సంక్రాంతి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి .గణనాధునికి వి టీమ్ వివేకానందనగర్ అధ్యక్షులు శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం కాంటెస్టెడ్ ప్రెసిడెంట్ దేవరింటి మస్తాన్‌రెడ్డి విజయ దంపతులతో పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలను పంపినీ చేశారు. అతిథులను శాలువలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో వి టీమ్ ప్రధాన కార్యదర్శి రవిముదిరాజ్, కోశాధికారి ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు రాగోలు సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ బొంతురవి, కాలనీ సీనియర్ నాయకులు ఉప్పాడ శశిభూషణరావు, అగతముడి రమేష్, గుప్తేశ్వర శర్మ, మల్లారెడ్డి, హైటెక్ ప్రసాద్, బొంతు హరికృష్ణ, భాను ప్రకాష్, దామోధర్,ఆకాష్, పాల్గొన్నారు.

**గాంధీనగర్ డివిజన్‌లో..**

**చిక్కడపల్లి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** గణేశ్‌నవరాత్రోత్సవాలను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ స్ట్రీట్‌నెంబర్ నైన్‌లో గజానంద్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్షవర్ధన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిమంటాన్ని బిఆర్ఎస్ యువనేత యువనేత ముఠాజైసింహాతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారులు చిట్టబోయిన ప్రభాకర్‌యాదవ్, చిట్టబోయిన సంతోష్‌యాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు తరుణ్, ఆదిత్య, విడిప్, రిషి, సర్సన్, కృషక్, తనీష్‌కుమార్, అభివన్, వంశి, సృజన్, సాయి, వంశీ, నరేశ్, బిఆర్ఎస్ నేతలు ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో...**

రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్‌కుమార్ యాదవ్ గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మంటపాన్ని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు వీడీ.కృష్ణ, శీలం సత్యనారాయణ, మారిశెట్టి నర్సింగరావు, సురేశ్‌యాదవ్, బాబ్జీ, సురేందర్, బాబూరావు, రాజు, మధు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**132 డివిజన్‌లో...**

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 డివిజన్‌లోని సుచిత్రలో మా కన్వెన్షన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపం వద్ద మేడ్చల్ మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు దమ్ముని శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బి.రంగయ్య, 132 డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ల ప్రవీణ్ కుమార్, రాజు పాల్గొన్నారు.

## తెలుగువారి తులసీదాసు ఎంఎస్.రామారావు : కొల్లేటి దామోదర్‌గుప్త


కార్యక్రమంలో పాల్గొన్న కొల్లేటి దామోదర్‌గుప్త, కళావిఎస్.జనార్ధనమూర్తి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** అచ్చమైన తేట తెలుగులో సుందరకాండను సామాన్యప్రజలు కూడా పాడుకునే విధంగా అందించిన ఎంఎస్.రామారావు తెలుగువారి తులసీదాసు అని తెలంగాణ పోలిసుహౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త అన్నారు. ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా బుధవారం మొట్టమొదటి సినీనేపధ్యగాయకుడు, హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువధించిన వ్యక్తి ఎంఎస్.రామారావు యాదిలో కార్యక్రమం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కొల్లేటి దామోదర్‌గుప్త మాట్లాడుతూ గేయ రూపంలో ఎంఎస్.రామారావు రచించి గానం చేసిన రామాయణ భాగం 'సుందరకాండ' గీతం నేడు 'ఎంఎస్.రామారావు సుందరకాండ'గా సుప్రసిద్ధం అని అన్నారు. తులసీదాస్ రచించిన హనుమాన్‌చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారని, ఈ రెండు రామారావుకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయన్నారు. తెలుగు చలనచిత్రలో మొట్టమొదటి నేపథ్యగాయకుడు ఎంఎస్.రామారావు అని కళావిఎస్. జనార్ధనమూర్తి అన్నారు. తన తండ్రి కళాసుబ్బారావుతో ఎంఎస్.రామారావుకు అనుబంధం ఉందని, గానసభ వేదికపై ఆయనను పలు సంస్థలు సత్కరించాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సాహితీవేత్త చిక్కా రామదాసు, గాయనీ పులిపాక రమాదేవి, గానసభ పాలకమండలి సభ్యుడు తాళ్ళపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై సమగ్ర విచారణ చేయండి


బిసి కమిషన్‌తో సమావేశమైన దేవల్ల సమ్మయ్య, సతీష్ కొట్టె, వినోద్, దుర్గం రవీందర్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై సమగ్రమైన విచారణ చేసి వాటికి అడ్డుకట్ట వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని బిసి కమిషన్‌న తెలంగాణ బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోరింది. ఈమేరకు బుధవారం ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు దేవళ్ల సమ్మయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం ఇటీవల నియమించబడ్డ బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు బాలలక్ష్మీ, టి.సురేందర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా సమగ్ర కులగణన, బిసి ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాలు, క్రిమిలేయర్, ఈడబ్ల్యూఎస్ , వివిధ సంస్థల్లో బిసి ఉద్యోగుల పోస్టింగ్, నామినేటెడ్ పదవుల్లో బిసిలకు జరుగుతన్న అన్యాయం వంటి అంశాలను కమిషన్‌తో చర్చించినట్లు తెలిపారు. ఈసందర్భంగా చైర్మన్ సభ్యులు స్పందిస్తూ దీనిపై కూలంకుషంగా చర్చించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో ప్రెసిడెంట్ సతీష్ కొట్టె, సెక్రటరీ వినోద్ కురువ, దుర్గం రవీందర్, ఉపాధ్యక్షులు విజయ్, ఛీఫ్ ఇంజనీర్ చక్రఫాణి, భద్రయ్య, వేణుగోపాల్, విజయలక్ష్మీ, రాజేశ్వరి, శ్రావణ్, ప్రభాకర్, శ్రీధర్, సునీత, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో మణికొండను నెంబర్‌వన్ మున్సిపల్‌గా మారుస్తున్నాం
### - చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్


మణికొండ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల దృశ్యం

**నార్సింగి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** మణికొండను రంగారెడ్డి జిల్లాలోనే అభివృద్ధిలో నెంబర్ వన్ మున్సిపల్‌గా మారుస్తున్నామని చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం మణికొండ మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశంను నిర్వహించి, వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.7.కోట్ల 60.లక్షల పనులకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారుల సహకారంతో వేగంగా అభివృద్ధి పనులు చేపట్టి, రాజధాని హైదరాబాద్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. వివిధ వార్డుల పరిధిలో ఎలక్ట్రిక్ వర్క్స్ కోసం రూ.25,లక్షలు, నూతన మున్సిపల్ భవన మిగులు పనుల కోసం రూ.5.కోట్లు, వట్టినాగులపల్లిలో డంపింగ్‌యార్డులో కంపోస్టు షెడ్, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.కోటి, ఉతనసవాల కోసం రూ.35.లక్షలు, జల మండలి పనుల నిర్వాహణ కోసం రూ.కోటి నిధులు కేటాయిం చామని, ఇందుకు ఏకగ్రీవంగా కౌన్సిల్ తీర్మాణం చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రదీప్ కుమార్, వైస్ ఛైర్మన్ నరేం దర్‌రెడ్డి,ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, మేనేజర్ శ్రీధర్, కౌన్సిలర్లు, అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

### చెస్ చాంప్ సంహితకు ఘన సత్కారం

**సైఫాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ఆగస్టు 28వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకు శ్రీలంకలోని వాస్కడువాలో కామన్వేల్త్ చెస్ టోర్నమెంట్ 2024లో సంహిత 3 పతకాలను కైవసం చేకుంది. కామన్వేల్త్ యూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో బ్లిట్జ్‌లో స్వర్ణం, ర్యాపిడ్‌లో కాంస్యం, క్లాసికల్ ఫార్మాట్‌లలో ఆమె కాంస్యం సాధించారు. ఆమె కింగ్స్ చెస్ అకాడమీతో అనుబంధంగా ఉన్న సాకేత్ పెదగంధం అండ్ దీప్తమ్‌ష్‌రెడ్డివద్ద శిక్షణ పొందారు. కాగా బుధవారం ఎల్‌బి స్టేడియంలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి ఎ.సోనిబాలాదేవి సంహితను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమెన్ గ్రాండ్ మాస్టర్ కావాలన్న సంహిత ఆకాంక్షకు సహకారం అందిస్తామన్నారు. ఈ ఏడాది ఆమె బాలికల యు10 విభాగంలో చెస్ స్వాలింగ్ ఛాంపియన్‌షిప్ ప్రపంచ కప్-బటుమి-2024లో స్వర్ణం, 26వ ఆసియా యూత్ చెస్ ఛాంపియన్‌షిప్ యు10 బాలికల (జట్టు), అల్మటి-2024లో రజతం, కామన్వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్-2024 (యు10 బాలికలు), మలేషియాలో కాంస్యం సాధించారు. 36వ జాతీయ అండర్ 09 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్‌లో గత ఏడాది జంషెడ్‌పూర్‌లో జరిగిన పోటీలలో ఆమె స్వర్ణంను కైవసం చేసుకున్నారు.

## నిధులను విడుదల చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం జీహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి 11 కోట్ల రూపాయల మేర ప్రతిపాదనలను తయారు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఆ ప్రాతిపదనలను కమిషనర్‌కు అందజేసి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందించి నిధులు మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

## గ్రేటర్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం
### -డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి


చెత్త తరలింపు బారోస్‌ను పంపణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శోభన్‌రెడ్డి

**తార్నాక, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** గ్రేటర్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, డీసీ సుభాష్‌తో కలిసి బుధవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయం వద్ద జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త తరలింపు (వీల్ బారో ఫ్రేమ్)లను పారిశుద్ధ కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా, చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దడానికి అధికారులు ప్రజల్లో అవగాహణ కల్పించాలని కోరారు. ప్రజలు కూడ పారిశుద్ధ కార్మికులకు సహకరించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుడా చూడాలని కోరారు. బారోస్ వస్తువుల వల్ల పారిశుద్ధ కార్మికులకు కొంత శ్రమ తగ్గి, చెత్త తరలింపు సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ సుభాష్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎస్ఎఫ్‌జె, ఎస్ఎఫ్ఏలతో పాటు కాంగ్రెస్ నాయకుడు పవన్ కళ్యాణ్, స్థానిక నాయకుడు సాయికుమార్, నరేష్, విశ్వ తధితరులు పాల్గొన్నారు.

## టిపిసిసిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియమితులవటం అభినందనీయం
### -రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు కామారెడ్డి హన్మాండ్లుగౌడ్


మహేష్ కుమార్ గౌడ్‌ను సత్కరిస్తున్న కామారెడ్డి హన్మాండ్లు గౌడ్, పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ నియమితులవటం అభినందనీయమని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు కామారెడ్డి హన్మాండు గౌడ్ కొనియాడారు. బుధవారం బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, రాష్ట్ర గౌడ హాస్టల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, రాష్ట్ర గౌడ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు పులి లక్ష్మీపతిగౌడ్ తదితర గౌడ సంఘం నాయకులతో కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హన్మాండ్లుగౌడ్ మాట్లాడుతూ గౌడ వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరలో పరిష్కారం అవుతయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా
### తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



**అత్తాపూర్ సెప్టెంబర్11,ప్రభాతవార్త :** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా బుధవారం ఢిల్లీలో వర్గీకరణకు వ్యతిరేకంగా వందలాది దళిత సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న బహిరంగ సభకు మద్దతుగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం జెఏసి ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ రాములకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....మాల సంఘాల నాయకులు రాష్ట్రంలో ఉన్న 50 లక్షల మంది మాలల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎవరు ప్రయత్నించిన తీవ్రంగా ప్రతిఘటిస్తామని రాష్ట్రంలో తెలంగాణ మాలల విశ్వరూపాన్ని చూపిస్తామని గత 15 రోజుల క్రితం మాల ఎమ్మెల్యేలు మాల ఎమ్మెల్సీలు ,ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం జెఏసి నాయకులు,మాలల ప్రతినిధి మంత్రి చంద్రశేఖర్,గొడుగు సంజీవ, కావలి అనంతరం,పంబల రాజు,సునిగంటి పెంటయ్య, పత్యార నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా



**అత్తాపూర్ సెప్టెంబర్11,ప్రభాతవార్త :** శేర్లింగంపల్లి ప్రాజెక్టు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ అంగన్ వాడీ 2వ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ తొకల శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు...మహిళలు,గర్భిణీలు ,కిశోర బాలికల్లో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించేందుకు అంగన్‌వాడీ టీచర్లు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ కవిత,నవ యువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి,అంగన్‌వాడీ టీచర్లు అనిత, కనకవ్వ,మాధవి,రత్న కుమారి,తదితరులు పాల్గొన్నారు.

## మహమూద్ కాలనీలో ఎమ్మెల్సీ, డిసి పర్యటన



**అత్తాపూర్ సెప్టెంబర్11,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్‌లోని మహమూద్ కాలనీలో డిసి రవి కుమార్‌తో కలిసి ఎమ్మెల్సీ రహమత్ అలీ పర్యాటించారు.ఈ సందర్భంగా రోడ్లు,పారిశుధ్య పనులను పరిశీలించారు.స్థానిక ప్రజలతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.పలువురు సమస్యలను వివరించారు. రోడ్డు పనులను కాంట్రాక్టర్‌తో చర్చించి వెంటనే చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఎంటమాలజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ


నియామకం పత్రాలు అందిస్తున్న నాయకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేసిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని ..మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు దమ్ము, ధైర్యం ఉంటే ఇచ్చిన మాటకు కట్టుబడి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణరెడ్డి, రాష్ట్ర కో-కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుల యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శులుగా మేడిపల్లి గ్రామానికి చెందిన పాకాల భూపతిరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన కర్ణాకర్‌లను నియమించి నియామకం పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేల పార్టీ మార్పులో హరీష్‌రావు దెయ్యాల వేదాలు వల్లించినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో కెసిఆర్ ఇతర పార్టీ ఎమ్మెల్యేలను బిఆర్ఎస్‌లో చేర్చుకున్న సమయంలో పార్టీ మార్పుపై హరీష్‌రావు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద లకు అండగా నిలుస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన నెరవేరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. కాగా తమపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన భూపతి రెడ్డి, కర్ణాకర్ కృతజ్ఞతలు తెలిపారు. కిసాన్ సెల్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశంగౌడ్, కొదరి మల్లారెడ్డి, రాజిరెడ్డి, జయంత్, కోరిమి రాజు, మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


కోహెడలో సభ్యత్వాలు సేకరిస్తున్న దృశ్యం

### ప్రజల మనస్సుల్లో బిజెపిని నిలిపేలా
## సభ్యత్వాలు సేకరించాలి : తిరుమలరెడ్డి

**కోహెడ/సిద్దిపేట అర్బన్/మిరుదొడ్డి, సెప్టెంబర్ 11,ప్రభాతవార్త:** కోహెడ మండల పరిధిలోని 27 గ్రామాల్లో 50 పోలింగ్ బూత్‌లలో బూత్‌కు 200 చొప్పున సభ్యత్వ నమోదు చేసి ప్రజల మనస్సుల్లో బిజెపిని నిలిపేలా సభ్యత్వాలు సేకరించాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్కిరెడ్డి తిరుమలరెడ్డి పిలుపునిచ్చారు. కోహెడలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశంతో కలిసి సభ్యత నమోదు కార్య క్రమం ప్రారంభించి నాయకులు డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామంచ రాంచంద్రరెడ్డి, బీంరెడ్డి లక్ష్మారెడ్డిలకు సభ్యత్వాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈనెల 25 వరకు సభ్యత్వా నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సయ్యగౌడ్, రమేష్, రజినీకాంత్‌రెడ్డి, తిరుపతి, శివకుమార్‌గౌడ్,సతీష్, రాంచంద్రారెడ్డి, సుమన్ యాదవ్, శ్రీకాంత్, సాగర్‌గౌడ్, సాగర్, పర్శరాములుగౌడ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

**మిరుదొడ్డిలో...**


మిరుదొడ్డిలో సభ్యత్వాలు సేకరిస్తున్న దృశ్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలని అ పార్టీ సీనియర్ నాయకులు హైదారాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్ అన్నారు. మండ్పల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోకెల్లా అత్యధిక కార్యకర్తలు,సభ్యత్వ నమోదు కలిగిన పార్టీ బిజెపి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దేవరాజు, నాయకులు మద్దెల రోశయ్య, కానుగంటి శ్రీనివాస్, మొగుళ్ల మల్లేశం, సూకురి లింగం, అమర్, కడారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట మున్సిపాలిటీలో...**


లింగారెడ్డిపల్లిలో సభ్యత్వాలు సేకరిస్తున్న దృశ్యం

సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు లింగారెడ్డిపల్లిలో పధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు మెదక్ ఎంపి రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బిజెవైఎం రాష్ట్ర నాయకులు తాటికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, ధర్మం, అభివృద్ధి బిజెపిలో సభ్యత్వాలు తీసుకోవడానికి ప్రజలు ఉత్సహంతో ముందుకు వస్తున్నారని తెలిపారు. దేశాభివృద్ధి బిజెపితోనే సాధ్యమవుతుందన్నారు. 32,43వ వార్డులలో పర్యటించి ప్రతి బూత్‌లో 200 తగ్గకుండ సభ్యత్వాలు చేయాలని బూత్ అధ్యక్షులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, మహేష్, ప్రశాంత్, గోపాల్, రాజు, వినయ్,సంజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శౌర్యయాత్రను జయప్రదం చేయాలి
### సిపిఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి


కరపత్రం ఆవిష్కరస్తున్న సీపీఎం నాయకులు

**కొమురవెల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** మద్దూరు మండలం వీర బైరాన్‌పల్లిలో ఈనెల 14న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరులను స్మరిస్తూ జరిగే శౌర్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురవెల్లి పార్టీ కార్యాలయంలో శౌర్య యాత్రను జయప్రదం చేయాలని ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం నాడు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తెలంగాణలో నైజం రజాకార్లకు దొరలు, భూస్వాములు జాగిందార్లకు వ్యతిరేకంగా బైరాన్‌పల్లిలో వీరోచితమైన పోరాటం సాగిందన్నారు. పోరాటంలో ఎందరో అమరులైనారని తెలిపారు. తెలంగాణ అమరవీరుల పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడూరు రవీందర్, తేలు ఇస్తారి, పుల్లంపల్లి సాయిలు,సార్ల యాదయ్య, నర్సవ్వ, ఆరుట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షకులకు సన్మానం

**మర్కుక్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** పది సంవత్సరాలుగా మట్టి గణపతిని పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలోని రామాలయం వ్యవస్థాపకుడు హరిపంతులును గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు బుధవారం సన్మానించారు. అలాగే కెసిఆర్ కాలనీలో మట్టి గణపతిని ప్రతిష్టించిన గణేష్ భక్త బృందం వారిని సైతం సన్మానించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పర్యావరణానికి ముప్పు ఉందని కొన్ని సంవత్సరాలుగా రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈ సంవత్సరం మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజిస్తున్న వారిని సన్మానించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా వినాయక నిమజ్జనం రోజున డిజె, డ్యాన్సులు చేయకుండా భగవన్నామ స్మరణతో భజనలు చేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.


పాములపర్తిలో హరిపంతులును సన్మానిస్తున్న రామరాజు


మాట్లాడుతున్న వైద్యులు

### పోషకాహారంపై మహిళలకు అవగాహన

**వర్గల్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** రాష్ట్రీయ పోషణ మహ్ 2024 కార్యక్రమంలో భాగంగా వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు తక్కువగా ఉన్న ముగ్గురు పిల్లలను గుర్తించి ఎన్ఆర్‌సి సిద్దిపేటకు పంపించినట్లు వైద్యాధికారి హరిత తెలిపారు. అనంతరం నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశానికి ప్రత్యేకాధికారిణి కవిత హాజరై పలు సూచనలు తెలిపారు.కార్యక్రమంలో ఎంపిడిఓ విజయలక్ష్మి, ఏపిఓ ఆనంద్, డాక్టర్ మీనా, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

### ఎఎంసి వైస్ చైర్మన్‌కు సన్మానం


సర్దార్‌ఖాన్‌ను సన్మానిస్తున్న మిత్రులు

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన సర్దార్‌ఖాన్‌ను బుధవారం అతనితో పాటు పదవ తరగతి చదువుకున్న తోటి మిత్రులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మిత్రుడు సర్దార్‌ఖాన్ ఏఎంసి వైస్ చైర్మన్ కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కదుల్ల రామరాజు, గోపిశెట్టి రవి, చిట్టాపురం కనకరాజు, శ్రీరామ్ శ్రీనివాస్, కృష్ణ, స్వామి పాల్గొన్నారు.

### కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

**కోహెడ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదేశాల మేరకు తహశీల్దార్ సురేఖ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోతె నాగభూషణం ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దెల రాజేశం, మద్దెల సుదర్శన్, రంగణమైన రామకృష్ణ, మల్కాపురం నర్సింలు, అల్లిబిల్లి కుమార్, చిన్నగల్ల బాలకుమార్, ధర్మారం ఎల్లయ్య, కనకరాజు, బాలకృష్ణ, స్వామి, రామస్వామి పాల్గొన్నారు.

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం

**బెజ్జంకి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** టిపిసిసి రాష్ట్ర నూతన అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య, ఆర్‌టిఏ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి చెన్నారెడ్డిలు హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

### అభివృద్ధి పనుల పరిశీలన

**బెజ్జంకి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయరణ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని దేవక్కపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్యటించి గ్రామంలోని పలు అభివృద్ధి పనులను డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. అలాగే గ్రామంలో గల ఎస్సి కాలనీలో గత మూడు యేండ్లుగా నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్‌రెడ్డి, పంజాల అజయ్, ఒంటెల సంపత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సంజీ అమరేంది. హరికృష్ణ తదితరులు ఉన్నారు.

### సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**దుబ్బాక, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన కారంకంటి లక్ష్మి బ్రెయిన్ వ్యాధితో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. లక్ష్మికి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మెదక్ ఎంపి రఘునంధన్‌రావు సహాయం కోరగా వెంటనే స్పందించిన ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ. 2 లక్షల మంజూరు చేయించడం జరిగింది. ఈ చెక్కుని బాధిత కుటుంబానికి బుధవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాటి బాలేష్‌గౌడ్ అందించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం యువ మోర్చా రాష్ట్ర నాయకులు దులం వెంకట్ గౌడ్, గాజుల భాస్కర్, ఓబిసి మోర్చా సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ సుంకోజీ ప్రవీణ్ కుమార్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యాక్షుడు రమణా రెడ్డి, మోత్కుపల్లి బద్రి, తదితరులు పాల్గొన్నారు.

### జోరుగా సాగుతున్న బిజెపి సభ్యత్వ నమోదు

**దుబ్బాక, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** బిజెపి ప్రాథమిక సభ్యత్వ నమోదు జోరుగా సాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాటి బాలేష్ గౌడ్ తెలిపారు. బుధవారం దుబ్బాకలో బిజెపి సభ్యుత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా హైదరాబాద్ మాజీ డిప్యూటి మేయర్ సుభాష్‌చందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి సభ్యత్వ నమోదు పట్టణంతో పాటుగా గ్రామాల్లో అధికంగా జరుగుతుందన్నారు. స్వచ్ఛందగా ప్రజలే ముందుకు వచ్చి బిజెపి సభ్యత్వ నమోదు అడుగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి, నాయకులు గాజుల భాస్కర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్ రెడ్డి, మల్లన్నగారి బిక్షపతి, ప్రవీన్ కుమార్, రమణా రెడ్డి, బద్రి, యాదగిరి, మహిళా మోర్చ నాయకులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న దృశ్యం


మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానించిన దృశ్యం

### పిఆర్‌టియు మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

**ములుగు, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** పిఆర్‌టియు మండల అధ్యక్షునిగా పూదారి శ్రీనివాస్‌ను, ప్రధాన కార్యదర్శిగా బద్దం మనోహర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. బుధవారం ములుగు మండల శాఖ అధ్యక్షుడు మొగిలి వెంకట నర్సింహారెడ్డి అధ్యక్షతన పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కమిటీ అసోసియేట్ అధ్యక్షునిగా కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా బి.గంగరాములు, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్.మాధవి, కార్యదర్శుగా కె.రమేష్, మహిళా కార్యదర్శిగా ఎం.కల్పనలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ఏ.అమర్నాథ్‌రావు, బి.రంగారావు, రాష్ట్ర బాధ్యులు జె.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.శ్రీనివాస్, ఏ.శ్రీనివాస్, ఎస్.జ్యోతి, వీణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక


జిల్లాస్థాయి ఖోఖో పోటీలో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్

**దుబ్బాక, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు దుబ్బాక మండల పరిధిలోని హబ్సీపూర్ గ్రామంలో ఉన్న మహత్మ జ్యోతి రావు పులే గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక కావడం జరిగింది పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 9న తూప్రాన్‌లోని ఆర్నాల్డ్ స్కూల్లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా సబ్ జూనియర్ ఖోఖో సెలెక్షన్‌లో జిల్లా నుండి సుమారుగా 150 మంది విద్యార్థులు వివిధ పాఠశాల నుండి క్రీడల్లో పాల్గొనగా అందులో హాబ్సీపూర్ గ్రామంలో ఉన్న మహత్మ జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతికి చెందిన రాహుల్, నందకిశోర్, సంజయ్‌లు గెలుపోంది రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన 3 ముగ్గురు విద్యార్థులు ఈ నెల 13 నుండి 15 వరకు హైదరాబాద్‌లో మౌలాలిలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలో పాల్గొంటారని పాఠశాల పిజికల్ డైరెక్టర్ తరుణ్ రాజ్ తెలిపారు.

### పదోన్నతులలో ఎస్‌జిటిలకు న్యాయం చేయాలి
#### -ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు


మాట్లాడుతున్న ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** పదోన్నతులలో ఎస్జీటీలకు న్యాయంచేయాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్‌రాథోడ్ అన్నారు. రాష్ట్ర టీచర్స్ యూనియన్ నారాయణ ఖేడ్ డివిజన్‌లో మడల శాఖ అధ్యకులు శంకర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని నారాయణఖేడ్, నెహ్రూనగర్, అబ్బెంద, చాప్టా(కే) గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం సభ్యత్వాలు నిర్వహించారు. సందర్భంగా సయ్యద్ సాబేర్ అలి, శ్రీనివాస్ రాథోడ్ మాట్లాడుతూ 1947 కంటే ముందు ఎస్టీయు సంఘ: ఆవిర్భవించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు ఇస్లావత్ నిర్మల, అనురాధ, జిల్లా ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ రాథోడ్, నాయకులు కసిరాం, కల్హేర్, నిజాంపేట్, నారాయణఖేడ్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, సిహెచ్ పండరి, శంకర్, మారుతి, మాణిక్యం, జ్ఞానేశ్వర్, విజయ్‌కుమార్, ప్రశాంత్, సంగుశెట్టి, నారాయణ చౌహాన్, విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### జెర్సీ పాలకేంద్రం వినాయకుడి వద్ద అన్నదానం

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని పంచగామ కమాన్ వద్ద జెర్సీ పాలకేంద్రం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి మండపం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్‌కుమార్ శెట్కార్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిలు, నాగల్‌గిద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, నాయకులు కాశీనాథ్ పాటిల్, సంజీవ్ పాటిల్, మాజీ జడ్పీటిసి సభ్యులు చందర్ నాయక్, వీర్‌శెట్టి, బసిరెడ్డి, కొండల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, అంబ్రూత్, సాయంగౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### వినాయక నిమజ్జన ఉత్సవంలో
## డిజె సౌండ్ బాక్స్‌లు నిషేధం : ఎస్ఐ కృష్ణారెడ్డి

**బెజ్జంకి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** వినాయక నిమజ్జన ఉత్సవాల్లో డీజె సౌండ్‌లు నిషేధించడం జరిగిందని..ఒక వేళ ఎవరైనా అంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిమజ్జనం సమయంలో గొడవలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు. చెరువులు, కుంటలు నిండి ఉండడంతో నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈత రాని వారు చిన్న పిల్లలు నిమజ్జన సమయంలో దూరంగా ఉండాలన్నారు. ఎక్కడ ప్రమాదవశాత్తు సంఘటన జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

### విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**కొమురవెల్లి, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు అండర్-14, బాలురు, బాలికలు, అండర్-17 బాలురు, బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, మండల నోడల్ అధికారి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడంలో ఎస్‌జిఎఫ్ క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు చదవుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ మండల కార్యదర్శి శివాని, పిఎడ్‌పి నర్సింహులు, వివిధ పాఠశాలల టీచర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.

### మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఎంపిడివో

**కొండపాక, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడే కుటుంబం సమాజం బాగుపగుతుందని ఎంపిడిఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం దెద్దెడలో మహిళ సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన ఏపిఎం మగ్దుంఅలీతో కలిసి మాట్లాడుతూ మహిళాలు అర్థికంగా ఎదగడానికి చిన్న వ్యాపారాలు చేయాలని సూచించారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ఎదుగుతున్నరని గుర్తు చేశారు. కోళ్ల పెంపకం ద్వారా ఇంటి వద్దనే ఉంటు అదాయాన్ని పొందవచ్చునన్నారు. 2500 కోడి పిల్లలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క కోడి పిళ్లకు రూ॥ 105 చెల్లించి మహిళలు కొనుగోలు చేశారని వివరించారు.కార్యక్రమంలో సీసీలు లింగం, అశోక్, కవిత, విఓఎలు, గొడుగు వెంకటమ్మ, సిహెచ్ లక్ష్మి, అరుణ, పెద్ది చంద్రకళ, భవిత, గ్రామస్తులు దొమల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

### నైతిక సమాజం న్యాయమైన సమాజంపై వ్యాసరచన పోటీలు

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 11,ప్రభాతవార్త :** నైతిక విలువలు క్షీణిస్తున్నాయి.. నైతిక సంక్షోభం సమాజంలో అశాంతి, అలజడులకు కారణమవుతుందని ఈ పరిస్థితిని రూపుమాపడానికి జమాఅతె ఇస్లామీహింద్ నైతిక విలువల ప్రచార ఉద్యమాన్ని చేపట్టిందని అ సంస్థ మహిళా విభాగం ప్రతినిధి డాక్టర్ అస్రా ముహ్సినా తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడారు. విలువల ప్రాచుర్యం కోసం నైతిక సమాజమే న్యాయమైన సమాజం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో జరిగే పోటీల్లో 18 నుంచి 30 ఏళ్లలోపు స్త్రీలు పాల్గొనవచ్చునని తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విజేతలకు నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. వ్యాసాలను ఈనెల 13 నుంచి 20వ తేదీలోగా పంపించాలన్నారు. పూర్తి వివరాలకు 9515478080 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### ఎస్‌జిటిలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి


ఓటుహక్కు కల్పించాలని వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌జిటిలు

**మర్కుక్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి ప్రాథమిక పాఠశాలలో మండలంలోని ఎస్‌జిటిల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌జిటిల సంఘం జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌జిటిలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని కోరుతూ అయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం గజ్వేల్ మండల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ జూన్‌లో జరిగిన బదిలీల్లో స్థానచలనం పొందిన ఎస్‌జిటి ఉపాధ్యాయులను వెంటనే బదిలీ చేయాలని, అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, 10వేల పిఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని, ప్రతి పాఠశాలకు కనీసం ముగ్గురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మర్కుక్ మండల నూతన అధ్యక్షునిగా బి.ముత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా ఏ.కమలాకర్‌రెడ్డి, కోశాధికారిగా పి.రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా హేమలత, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులుగా స్వప్న, విజయకుమారిలను ఎన్నుకున్నారు.

### పిఆర్‌టియు మండల కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

**రాయపోల్, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** రాయపోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాయపోల్ మండల అధ్యక్షుడిగా ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లచ్చుగారి కనకారెడ్డిలను ఎన్నుకున్నారు. ఆనంతరం నూతనంగా విచ్చేసిన ఉపాధ్యాయులకు,బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులను పిఆర్టియూ మండల శాఖ తరుపున శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి జిల్లా పిఆర్టియు అధ్యక్షులు ఆధారాస్పల్లి శశిధర్‌శర్మ, మాజీ అధ్యక్షులు పంతం వెంకరాజు,రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ముత్యంరెడ్డి, రాజమహేందర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

### మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

**గజ్వేల్, సెప్టెంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఈనెల 17న నిర్వహించే శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ హాజరుకావాలని మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి శ్రీ విశ్వకర్మ యజ్ఞ ఉత్సవ సమితి బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి విఠల్‌చారి, ఉపాధ్యక్షుడు గడియారం వెంకటేశంచారి, సహాయ కార్యదర్శి గడియారం స్వామిచారి, పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం



ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన హజ్రత సుఫీ షా దర్గా

## రాయిపల్లిలో ప్రారంభమైన దర్గా ఉర్సు ఉత్సవాలు

**మనూర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలోని ఉర్సు షరీఫ్ హజ్రత్ సూఫీ షా మొహమ్మద్ రోషన్ అలీ 39వ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి సోఫ ష మొహమ్మద్ అక్రమ్ అలీ, ఉర్సు రహమత్ హుస్సేన్ ఖాద్రిలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నట్లు, భక్తుల సౌకర్యార్థం దర్గా వద్ద తగు ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

## ప్రతి శుక్రవారం గ్రామాల్లో 'పరిశుభత్ర' : ఎంపిడివో



మాట్లాడుతున్న ఎంపిడిఓ అలివేలు మంగ

**మనూర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి శుక్రవారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అలివేలు మంగ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మనూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లోని మురుగుకాల్వలను పరిశుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంక్‌లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డంపింగ్ యార్డును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వివేకానంద్, జూనియర్ అసిస్టెంట్ అనంత్, యాదగిరి తదితరులు ఉన్నారు.

## బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలి



కొడపాకలో పోషన్ పక్వాన్ కార్యక్రమం దృశ్యం

**పాపన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** బాలింతలు, గర్భిణీలు సమతుల్య ఆహారం తీసుకోవాలని కొడపాక అంగన్‌వాడి సూపర్‌వైజర్ సక్కుబాయి సూచించారు. బుధవారం కొడపాకలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొడపాక అంగన్‌వాడి టీచర్లు గంగమణి, పద్మ, గాజులగూడెం, చిత్రియాల టీచర్లు షకీరా బేగం, అప్సరి బేగం తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయండి

### సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** గణేష్ నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ గిరిధర్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం గణేష్ నిమజ్జనం చేసే మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నారింజ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను అమర్చాలని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి, పట్టణ సిఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్, మున్సిపల్‌కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్దాస్ మనోహర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, ఉత్సవ కమిటీ నాయకులు గొల్ల భాస్కర్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, అధికరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం చేసుకోవాలి: ఎస్ఐ

సిర్గాపూర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త: గణేశ నిమర్జన కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకోవాలని ఎస్ఐ మండల ప్రజలకు సూచించారు. నిమర్జనం కార్యక్రమంలో డిజేలంకు అనుమతి లేదని సూచించారు. ఊరేగింపు సందర్బంగా, మండప వద్ద డీజేలు పెడితే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. నిమర్జనం సందర్బంగా తాగి తందానాలు ఆడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## రజక సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

**పుల్కల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** రజక సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షులుగా సిహెచ్ వెంకటేశం(రాయిపాడ్), ఉపాధ్యక్షులుగా సిహెచ్. భాస్కర్ (పుల్కల్), శివకోటి(కోడూర్), ప్రధాన కార్యదర్శిగా దత్తు(సింగూర్), కోశాధికారిగా శ్రీశైలం(పుల్కల్), సంయుక్త కార్యదర్శిగా ఆంజనేయులు(బస్వాపూర్), కార్యవర్గ సభ్యులుగా సిహెచ్ రవి(పెద్దరెడ్డిపేట), మల్లేశం(ముదిమాణిక్), దశరథ్(గొంగ్లూర్), సిహెచ్. శివరాజ్(ముద్దాయిపేట్), ఆంజనేయులు(మిన్పూర్), మారుతి(పోచారం)లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రంజక సంఘం నాయకులు శేషాద్రి, నర్సింలు, ఆగమయ్య, నర్సింలు, నాగయ్య, పాండు, వేణు, బాగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



రజక సంఘం పుల్కల్ మండల కమిటీ బాధ్యులు

# విద్యార్థులు క్రీడలపై దృష్టిసారించాలి : ఎమ్మెల్యే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**రామాయంపేట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువులతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. ఆయన బుధవారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రామాయంపేట మండల స్థాయి పాఠశాల క్రీడా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థిని, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మెదక్ నియోజకవర్గం అభివృద్ది పరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో రామాయంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు, పట్టణంలోని 129 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. గత పాలకులు 10 సంవత్సరాల కాలంలో కొబ్బరికాయలకు, శిలాఫలాకాలకే పరితమైనారని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల కాలంలోనే ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. రాబోయే కాలంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేర్చి ప్రజా ప్రభుత్వంగా ప్రజలను అక్కు చేర్చుకుంటామన్నారు. నియోజక వర్గ ప్రజల ఆశీస్సులతో రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా, ప్రజల మన్ననలను చూరగుంటామని ఎమ్మెల్యే రోహిత్ రావు తెలిపారు. కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్‌లు దేమె యాదగిరి, చిలుక గంగాధర్, తహసీల్దార్ రజనీకుమారి, పిడి నాగ రాజు, టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రామ చంద్రగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, నాయకులు ఎనిశెట్టి అశోక్, వెంకుగారి శ్రీధర్‌రెడ్డి, చింతల స్వామి, చిలుక స్వామి, మాజీ సర్పంచ్ శివప్రసాద రావు, సుంకోజు దామోదర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, స్థానిక సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

# మెదక్ మెడికల్ కళాశాలకు అనుమతి ఇవ్వడంపై హర్షం



ఎంపీ రఘునందన్‌రావు, కేంద్ర మంత్రి నడ్డా, ప్రధాని మోడీ చిత్రపటాలకు క్షీరాభిషేకంచేస్తున్న దృశ్యం

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్11 ప్రభాతవార్త:** మెదక్ మెడికల్ కళాశాలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వడం హర్షించదగ్గ విషయమని, దీనికి కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని బస్ డిపో వద్ద ఎంపి రఘునందన్‌రావు, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల ముందు ఆగమేఘాలపై మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేసి వదిలేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది మెడికల్ కలాశాలలకు అనుమతులు కోరితే నాలుగు మెడికల్ కలాశాలలకు అనుమతి ఇచ్చిందని, మిగితా నాలుగు మెడికల్ కళాశాలలకు మౌలిక సదుపాయలు సరిగ్గా లేనవి జాతీయ వైద్య మండలి తిరస్కరించిందన్నారు. ఈ విషయంలో రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, స్థానిక బీజేపీ ప్రతినిధులు జిల్లా అధికారులను సంప్రదించి ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వారు వెంటనే స్పందించి జిల్లా అధికారులతో చర్చించి జాతీయ వైద్య మండలితో మాట్లాడి మెదక్ మెడికల్ కాలేజీకి అనుమతి వచ్చేలా విశేష కృషి చేశారన్నారు. ఈ అనుమతి రావడంలో నిర్లక్ష్యం వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం మెదక్ ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి సంబరాలు చేసుకోడం సిగ్గుచేటని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ అని ముద్దాడినట్లు ఉందన్నారు. ఇకనైనా మెదక్ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు డా. మురళిగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్ రెడ్డి, సీహెక్. శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి వెలుమల మహేశ్వ్ర, మోర్చాల అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, గడ్డం కాశీ, సీనియర్ నాయకులు రాగి రాములు, వివిధ మండలాల అధ్యక్షులు నాయిని ప్రసాద్, పోగుల రాజు, రంజిత్‌రెడ్డి, ప్రభాకర్, బి. రాములు, చంద్రశేఖర్, భాను, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే మహిళలకు గుర్తింపు : ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**రామాయంపేట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే మహిళలకు అన్ని రంగాల్లో గుర్తింపు లభిస్తుందని, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో బుధవారం ఎస్సీ కమిటీ హాల్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మెదక్ జిల్లా సహకారంతో నిరుద్యోగ ఎస్సీ మహిళలకు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ టైలరింగ్ కింద రెండు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనాపూర్ గ్రామాన్ని గత ప్రభుత్వ పాలకులు పది సంవత్సరాలు పరిపాలించిన అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. అలాగే న్యాక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కుట్టు శిక్షణకార్యక్రమంలో మహిళలు రెండు నెలలపాటు శిక్షణతీసుకొని కుట్టుమిషన్లను ఉచితంగా పొందవచ్చిన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయలక్ష్మి, రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్‌లు దేమె యాదగిరి, చిలుక గంగాధర్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు చౌదరి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, కోనాపూర్ విద్యాసాగర్, సొసైటీ డైరెక్టర్ సిద్దరాములు, మాసాయిపేట మల్లేశం, ఎనిశెట్టి అశోక్, వెంకుగారి శ్రీధర్‌రెడ్డి, చింతల స్వామి, చిలుక స్వామి, సుంకోజు దామోదర్, మహిళలు పాల్గొన్నారు.

## హిందూ ధర్మాన్ని అవమానించేవారిపై చర్యలు తీసుకోవాలి

### -బిజెవైఎం మెదక్ జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్11 ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గణపతి నవరాత్రుల కంకణాలను హిందూ ధర్మం అవమానించేలా తెంచేసి చెత్తబుట్టల్లో వేయడం సరికాదని బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అండతో పార్టీలకు సంబంధించిన నాయకులు నడిపిస్తున్న పాఠశాలల్లో ఏంచేసినా నడిచిపోతుందని, నచ్చినట్లు హిందూ ధర్మాన్ని అవమానించేలా వ్యవహరిస్తున్న యజామాన్యాలపై జిల్లా విద్యాధికారి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కంకణాలు తొలగించిన సంఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

**వెల్దుర్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పీడీ కమలతోపాటు ఉపాధ్యాయ బృందం బదిలీ అయ్యారు. బుధవారం పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులను మండల విద్యాధికారి యాదగిరితో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలు సహజమని, వారు ఉన్నప్పుడు చేసిన సేవలు విద్యార్థులకు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



బిజెపి సభ్యత్వ నమోదు దృశ్యం

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటాలి

### -ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో మెదక్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, నాయకులు డా. మురళిగౌడ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త మహోద్యమంలా ముందుకు సాగాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని సూచించారు. జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సభ్యత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో చాలా ప్రభావం చూపుతుంతని, మోడీ సారథ్యంలో ఉన్న ప్రభుత్వానికి మనం చేసే సభ్యత్వాల వల్ల బలం చేకూరాలని అన్నారు. రాష్ట్ర నాయకులు డా. మురళిగౌడ్ మాట్లాడుతూ ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తుందని, దీనికి కారణమైన నరేంద్ర మోడీకి మద్ధతుగా నిలవాలని ప్రతి ఒక్కరూ ఎదురు చూస్తున్నారని అన్నారు. గణనీయంగా సభ్యత్వాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు డా. మురళిగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్ రెడ్డి, సీహెచ్ శ్రీనివాసులుల, జిల్లా ఉపాధ్యక్షులు తీగల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి వెలుముల మహేశ్వరి, మోర్చాల జిల్లా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, గడ్డం కాశీ, సీనియర్ నాయకులు రాగి రాఉలు, వివిధ మండలాల అధ్యక్షులు నాయిని ప్రసాద్, పోగుల రాజు, రంజిత్‌రెడ్డి, ప్రభాకర్, బి. రాములు, చంద్రశేఖర్, భాను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం సీజ్

**అల్లాదుర్గం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఐబి చౌరస్తా గుండా అక్రమంగా బొలేరో వాహనం (టిఎస్ 15 యుఈ 0618)లో తరలిస్తున్న 3 టన్నుల 50 కిలోల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఐబి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సందర్బంగా అటుగా వచ్చిన బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యంను గుర్తించామన్నారు. పట్టుకున్న పిడిఎస్ బియ్యంను పెద్ద శంకరంపేట గోదాంకు పంపినట్లు పేర్కొన్నారు. పట్లంకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. పోలీసులు రేషన్ బియ్యంను పట్టుకున్న విషయం తనకు సమాచారం లేదని తహసీల్దార్ మల్లయ్య వివరణ ఇచ్చారు.



అల్లాదుర్గం ఐబి చౌరస్తా వద్ద అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ దృశ్యం

# పేదలకు అందని రేషన్ బియ్యం

## డీలర్ రాడు-బియ్యం ఇవ్వడు.. పండుగ పూట ఖాళీ కడుపుతో ప్రజలు

**పాపన్నపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** ప్రజలెవరూ పస్తులతో ఉండరాదన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యంను అందిస్తుంటే డీలర్ల నిర్లక్ష్యంతో ప్రజలు పస్తులుండాల్సిన దుస్థితి దాపురించింది. ప్రతి నెల 20వ తేదీ నుంచి రేషన్ డీలర్లకు గోదాం నుంచి బియ్యం సరఫరా చేస్తూ ఉంటారు. కొందరు డీలర్లు గోదాం నుంచి రేషన్ బియ్యం తీసుకుపోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో ప్రజలు పస్తులుండక తప్పడం లేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని పాత లింగయ్యపల్లి గ్రామానికి డీలర్ ఆగస్టు 22 నుంచి బియ్యం తీసుకెళ్లి సెప్టెంబరు 1వ తేదీనుంచి పేదలకు పంపిణీ చేయాల్సి ఉండగా సమయానుకూలంగా పంపిణీ చేయలేదు. డీలర్ రేషన్ బియ్యం పంపిణీ చేయకపోవడంతో పాత లింగయ్యపల్లి, అమీర్య, సోమ్లాతండాలకు చెందిన ప్రజలు బియ్యంను అందుకోలేకపోయారు. రేషన్ బియ్యం అందకపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు వినాయక చవితి పర్వదినాన పస్తులుండక తప్పలేదు. బియ్యం అందక పస్తులుంటామని గ్రహించిన కొందరు చీకోడ్, కొత్తలింగాయపల్లి, టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట తదితర గ్రామాలకు వ్యయ ప్రయాస పడుతూ రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్న సంబంధిత రేషన్ డీలర్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసి కొన్ని నెలలకు మరోసారి అవకాశం ఇచ్చారు. డీలర్ తన ఇష్టారీతిగా బియ్యం సరఫరా చేస్తాడని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 1వ తేదీ నుంచి రేషన్ బియ్యం సరఫరా చేయాల్సి ఉన్నా ఇంతవరకు గిద్దంగి నుంచి బియ్యం తెచ్చుకోలేనట్లు తెలుస్తోంది. రేషన్ డీలర్ బియ్యం పంపిణీలో తీసుకుంటున్న నిర్లక్ష్యంతో ప్రజలు పడుతున్న పాట్లను ప్రభాతవార్త తహసీల్దార్ సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఈ నెల 10న సాయంత్రం డీలర్ గిద్దంగి నుంచి బియ్యం తీసుకెళ్లినట్లు వివరణ ఇచ్చారు. గిద్దంగి పరిధిలోని మూడు గ్రామాల డీలర్‌లతో తలనొప్పిగా మారిందని గిద్దంగి ఇన్‌చార్జి నర్సింలు వాపోయారు. జిల్లా అధికారులు స్పందించి ప్రతి నెల వినియోగదారులకు రేషన్‌బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించే రేషన్ డీలర్‌లపై కొరడా రుళిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## హద్నూర్‌లో నిమజ్జనానికి తరలిన వినాయకుడు

న్యాల్‌కల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త: వారంరోజులు భక్తులచే పూజలు అందుకున్న తొలిపూజలందుకునే పార్వతీదేవి తనయుడు బుధవారం గంగమ్మ ఒడికి పయనమయ్యాడు. మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్టించిన విఘ్నేశ్వరుడికి నిత్యం సాయంత్రం భక్తులు అర్చకులు శివమూర్తి స్వామి వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబోదరుడిని నిమజ్జనానికి తరలిస్తున్న సందర్బంగా గ్రామ భక్తులు మరో మారు వక్రతుండికి పూజా కార్యక్రమాలు నిర్వహించి అందంగా అలంకరించిన వాహనంలో ఏకదంతుడిని ప్రతిష్టించుకుని నిమర్జనానికి తరలించారు.

**ఆర్‌టిసి డిపో నుంచి...**

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్టీసి డిపో పరిసరాల్లో ప్రతిష్టించిన వినాయకుడిని ఐదు రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించి బుధవారం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనానికి ఏకదంతుడిని తరలించే ముందు డిపోమేనేజర్ మల్లేశం అధికారులు, సిబ్బందితో కలిసి పూజలు నిర్వహించి వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డిపోలో ప్రతిష్టించిన వక్రతుండుడి చేతిలో 5 రోజులు పూజలు అందుకున్న మొదటిలడ్డూను వేలంవేయగా రూ.6100 మెకానిక్ కెఎస్ నారాయణ, రెండవ లడ్డూను మెకానిక్ కిష్టయ్య రూ.3800, పండ్లను రూ.523 నర్సింలు దక్కించుకున్నారు. డిపోపరిధిలో అన్నదానం నిర్వహించారు.

## రెండవరోజుకు చేరిన నిరుద్యోగుల దీక్ష



నిరసనదీక్షలో పాల్గొన్న స్థానిక నిరుద్యోగ యువకులు

**హత్నూర సెప్టెంబరు 11 ,ప్రభాతవార్త:** స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగ బద్రత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ,హత్నూర మండలం బోర్పట్ల గ్రామస్థులు చేపట్టిన నిరసనదీక్ష బుదవారం రెండవరోజుకు చేరింది. బోర్పట్ల గ్రామంలోని ఎపిటోరియా పరిశ్రమ స్థానికులకు ఉద్యోగఅవకాశాలు ఇవ్వకుండా ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగఅవకాశాలు ఇస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగానికి అర్హులైనప్పటికి ఇవ్వడంలేదని, పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనంలేకుండా పోయిందని అవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు లెబర్ పనికి పరిమితం చేశారని అన్నారు. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగ బద్రత కల్పించాలని కోరుతూ నిరసనదీక్ష చేపట్టామని స్థానిక నిరుద్యోగులు తెలిపారు. టెంట్లు వేసుకోవడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో టెంట్లు లేకుండానే దీక్ష కొనసాగించారు. గురువారంనాటి నిరసనదీక్షను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్ సందర్శించి వారికి మద్దతు తెలిపారు.

## గణేష్ నిమజ్జనానికి కొనసాగుతున్న ఏర్పాట్లు....



చెరువులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో జరగనున్న గణేష్ నిమర్జనానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ సిబ్బందితో కలిసి పట్టణంలో చెరువులను పరిశీలించారు. ముఖ్యంగా ఎక్కువ వినాయకులు నిమజ్జనం చేసే సర్వాయికుంట, కొత్తచెరువును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో చాలా పెద్దఎత్తున గణేష్‌లను ప్రతిష్టించారని, జరగబోవు నిమజ్జనం ప్రశాంతమైన వాతావరణంలో జరిగేవిధంగా చూస్తామన్నారు. అందుకు మున్సిపల్ పరంగా అన్ని రకాలుగా సహకరిస్తామని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామ న్నారు. కాగా సర్వాయికుంట వద్ద క్రేన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున భారీ వినాయకులతోపాటు అన్ని గణపతులను సర్వాయికుంటలోనే నిమర్జనం చేయాలని సూచించారు. అనంతరం గణేష్ నిమర్జనం సందర్భంగా చెరువుల వద్ద చేయవలసిన ఏర్పాట్ల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్, సానిటరి ఇన్‌స్పెక్టర్ పోచమ్మల శంకర్, ఎలక్ట్రిషన్ మైసయ్య, ఇంజనీరింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

## ఎమ్మెల్యే రోహిత్‌రావుకు క్షీరాభిషేకం



పాలాభిషేకంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

**రామాయంపేట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త :** మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావుకు బుధవారం రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయనకు పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు స్థానిక మెదక్ క్రాస్‌రోడ్డు వద్ద ఎమ్మెల్యే రోహిత్‌రావు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఆ తర్వాత వచ్చిన టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## యువ గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం

**కొల్చారం, సెప్టెంబర్11 ప్రభాతవార్త:** వినాయక చవితిని పురస్కరించుకొని కొల్చారంలోని యువ గణేష్ మండలి ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. ఏడు సంవత్సరాల నుండి మంచినీళ్ల గైను వద్ద వినాయక మండపాన్ని ఏర్పాటు చేస్తూ గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో యువ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి : సంగయ్య

**కొల్చారం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** 317 జీవో ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. సంగయ్య అన్నారు. బుధవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా కొల్చారం మండల పరిధిలోని కొంగోడ్, అంసాన్‌పల్లి, వరిగుంతం, కొల్చారం, సంగాయిపేట, రంగంపేట పాఠశాలలను సందర్శించి సభ్యత్వాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. సంగయ్య విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఖాళీస్థానాల్లో విద్యా వలంటీర్లను నియమించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె. యాదగిరి, రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఎండి. నజీరుద్దీన్, కొమ్మ శ్రీనివాస్, కొల్చారం ప్రధాన కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



టిపిటిఎఫ్ సభ్యత్వ నమోదు దృశ్యం